



ఫెర్రో అల్లాయిస్ పరిశ్రమ



ప్రజలు, నేతల అభిప్రాయాలు - 8లో

బడ్జెట్ భరోసా నింపేనా?

సాగునీటి ప్రాజెక్టుల పనులు గత ఐదేళ్లలో పడకేశాయి. ఫలితంగా వేలాది ఎకరాల్లో ఆయకట్టుకు నీరు అందడం లేదు. వర్షాధారంపై సాగు చేస్తున్న రైతులు చివరకు పంట నష్టాలను ఎదుర్కొంటున్నారు. ఇటు పరిశ్రమలూ దాదాపు తిరోగమనంలో ఉన్నాయి. జనపనార, ఫెర్రో అల్లాయిస్, చక్కెర పరిశ్రమలు మూతపడ్డాయి. అవి తెరిస్తే వందలాది మంది కార్మికులకు ఉపాధి దొరుకుతుంది. చక్కెర పరిశ్రమలు తెరుచుకుంటే చెరకు రైతులకూ ఊరట. రహదారులకు మరమ్మతులు చేపట్టినప్పటికీ పూర్తిస్థాయి నిర్మాణం కోసం కొన్ని రహదారులు ఎదురుచూస్తున్నాయి. ఇక విభజన హామీల్లో భాగంగా జిల్లాకు కేటాయించిన గిరిజన యూనివర్సిటీ భవనాలు ఎప్పటికి పూర్తవుతాయో తెలియడం లేదు. వైద్యం కూడా గాడిన పడలేదు. కీలక పోస్టులను భర్తీ చేయడం లేదు. మౌలిక సాకర్యాలు లేవు. ఈ సమస్యలకు ఈసారి బడ్జెట్ సమావేశాలు పరిష్కారం చూపుతాయన్న ఆశతో జిల్లా ప్రజలున్నారు. సోమవారం నుంచి అసెంబ్లీ సమావేశాలు మొదలవుతున్నాయి.

- నిలిచిపోయిన సాగునీటి ప్రాజెక్టుల పనులు
- మూతపడిన పరిశ్రమలు
- కొన్ని రహదారుల్లో ప్రయాణం నేటికీ ప్రమాదకరమే
- గిరిజన వర్సిటీ భవనాలు ఎప్పటికో?
- ఆస్పత్రుల్లో మౌలిక సాకర్యాలు కరువు
- బడ్జెట్ సమావేశాలపై జిల్లా వాసుల్లో గంపెడాశలు

విజయనగరం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి)

కూటమి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న తొలి పూర్తి స్థాయి బడ్జెట్‌పై జిల్లా ప్రజలు చాలా నమ్మకంతో ఉన్నారు. అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని సీఎం చంద్రబాబు పదేపదే చెబుతుండడంతో సాగునీటి ప్రాజెక్టుల పనులు తప్పకుండా మొదలవుతాయని రైతులు అభిప్రాయపడుతున్నారు. పరిశ్రమలు పునః ప్రారంభం కావొచ్చునని కార్మికులు ఆశిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని బొబ్బిలి, రాజాం, సాలూరు ప్రాంతాల్లో 20 వరకూ పరిశ్రమలు మూతపడ్డాయి. జూట్, ఫెర్రో పరిశ్రమలు దాదాపు పనిచేయడం లేదు. వీటికి కొత్త రోజులు రావచ్చునని ప్రజలు భావిస్తున్నారు. రెండు చక్కెర పరిశ్రమలు సహకార రంగంలో నడిచేవి. రెండు ఆగిపోయాయి.

రహదారులు..

జిల్లాలో అంతర్ రాష్ట్ర, జిల్లా రహదారులు ఉన్నాయి. అవి ఐదేళ్ల వైసీపీ పాలనలో దారుణంగా తయారయ్యాయి. తగరపువలస- విజయనగరం- రాజాం రహదారి ప్రధానమైనది. అలాగే విజయనగరం-పార్వతీపురం, చిలకపాలెం-పార్వతీపురం రోడ్లు సైతం దారుణంగా మారాయి. రోడ్ల మరమ్మతులకు కూటమి ప్రభుత్వం రూ.23.52 కోట్లు మంజూరు చేసింది. మిగతా వాటి నిర్మాణంపై సైతం ప్రభుత్వం దృష్టిసారించాల్సిన అవసరముంది.

గిరిజన యూనివర్సిటీ..

జిల్లాలో గిరిజన విశ్వ విద్యాలయానికి నేటికీ పక్కా భవనాలు లేవు. రాష్ట్ర విభజన హామీల్లో భాగంగా అప్పట్లో ఈ యూనివర్సిటీని కేటాయించారు. తొలుత శృంగవరపుకోట నియోజకవర్గంలోని రెల్లిలో స్థల ఎంపిక చేసి 2015లో సీఎం చంద్రబాబు వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం యూనివర్సిటీని దత్తిరాజేరు-మెంటాడ మండలాల్లోని సరిహద్దు ప్రాంతాలకు మార్చింది. ప్రస్తుతం 519 ఎకరాల్లో పనులు ప్రారంభించారు. నిర్మాణం శరవేగంగా జరిపించాల్సిన అవసరం రాష్ట్ర ప్రభుత్వంపై ఉంది.

వైద్య రంగం..

జిల్లాలో విద్య, వైద్య (మిగతా 8వ పేజీలో..)



తారకరామ తీర్థసాగర్





గిరిజన యూనివర్సిటీ తాత్కాలిక భవనం

అభివృద్ధికి దూరంగా విజయనగరం..

విజయనగరం రూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంగా వున్న విజయనగరం సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీ నుంచి నగరపాలక సంస్థగా రూపాంతరం చెందింది. అభివృద్ధి మాత్రం లేదు. ఆహ్లాదాన్ని పంచే పార్కులు అంతంత మాత్రం. ఇక నగర జనాభాకు సరిపడా మంచినీటి సౌకర్యం లేదు. పెద్దచెరువు వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ అలాగే వుండిపోయింది. రాజీవ్‌క్రీడామైదానం, విజ్జీ స్టేడియంలో మౌలిక సదుపాయాల కల్పనకు బడ్జెట్‌లో కేటాయింపులు చేయాలన్నది క్రీడాకారుల డిమాండ్. విజయనగరం నుంచి భోగాపురం ఎయిర్‌పోర్టుకు కనక్ట్ అయ్యే రహదారిని విస్తరించాల్సి ఉంది.

అపరిష్కృతంగా రాజాం సమస్యలు..

రాజాం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): రాజాం నియోజకవర్గంలో చాలా సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయి. ముఖ్యంగా రవాణా కష్టాలు తీరడం లేదు. విజయనగరం నుంచి రాజాం మీదుగా ఉన్న పాలకొండ రోడ్డు దారుణంగా తయారైంది. విస్తరణలో భాగంగా ఈ రోడ్డు నిర్మాణం చేపడతామని వైసీపీ ప్రభుత్వం చెప్పింది. కానీ ఐదేళ్లలో మాటలతో గడిపేసింది. రాజాం నియోజకవర్గంలో పరిశ్రమలు మూతపడ్డాయి. ముఖ్యంగా జనపనార పరిశ్రమలు ఒకటి రెండు తప్ప అన్నీ మూతపడ్డాయి. ఆయా పరిశ్రమల యాజమాన్యాలతో చర్చించి ప్రభుత్వపరంగా చేయూతనిస్తే తెరుచుకునే అవకాశం ఉంది. అలాగే మడ్డువలస, నారాయణపురం ఆనకట్టలు, సాయన్న ఛానెల్, తోటపల్లి కాలువల ఆధునికీకరణ వంటిపై దృష్టిసారించాల్సిన అవసరముంది. మరోవైపు రాజాం మీదుగా రైల్వేలైన్ నిర్మాణానికి కేంద్ర రైల్వేశాఖ డీపీఆర్ రూపొందిస్తున్న సమయంలో రాష్ట్ర ప్రభుత్వ పరంగా మరింత చొరవచూపాలని అందరూ కోరుకుంటున్నారు.

ప్రశాంతంగా గ్రూప్-2 మెయిన్స్

● 12 కేంద్రాల్లో పరీక్ష ● 84.69 శాతం అభ్యర్థులు హాజరు ● కేంద్రాలను తనిఖీ చేసిన జేసీ సేతు మాధవన్



పర్యవేక్షిస్తున్న జేసీ సేతుమాధవన్

విజయనగరం కలెక్టరేట్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష ఆదివారం జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 10 నుంచి 12.30 (పేపర్ 1), మధ్యాహ్నం 3 నుంచి 5.30 (పేపర్ 2) వరకు పరీక్ష నిర్వహించారు. 12 కేంద్రాల్లో 84.69 శాతం మంది పరీక్షకు హాజరయ్యారు. పరీక్షకు 6265 మంది దరఖాస్తు చేసుకోగా 5844 మంది అభ్యర్థులు హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నారు. వీరిలో ఉదయం పరీక్షను 5306 మంది రాయగా, మధ్యాహ్నం పరీక్షకు 5292 మంది హాజరయ్యారు. అభ్యర్థులు ఉదయం 9 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. హాల్ టిక్కెట్‌తో పాటు గుర్తింపు కార్డును చూపించాక నిర్వాహకులు లోపలికి అనుమతించారు. ప్రతి పరీక్ష కేంద్ర వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. విజయనగరంలోని జేఎన్‌టీయూ, సీతం కళాశాలల్లో జరిగే పరీక్షలను జేసీ సేతుమాధవన్ పరిశీలించారు. డీఆర్వో శ్రీనివాసమూర్తి పరీక్ష నిర్వహణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.



మహరాజ కళాశాల కేంద్రంలో పరీక్షకు ముందు అభ్యర్థులు



రాజాం గాంధీనగర్‌లో స్క్రీన్‌పై మ్యాచ్‌ను వీక్షిస్తున్న దృశ్యం

రోజంతా మ్యాచ్ వీక్షణం

- భారత్-పాకిస్థాన్ మ్యాచ్‌ను తిలకించిన జిల్లా ప్రజలు
- ఫోన్‌లు, టీవీలు, స్క్రీన్‌లకు అతుక్కుపోయిన వైనం

విజయనగరం రూరల్/ రాజాం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): విజయనగరం ఆదివారం నిర్మానుష్యంగా మారింది. క్రికెట్ మ్యాచ్.. అందులోనూ దాయాదుల పోరు (భారత్-పాకిస్థాన్) కావడంతో ఎక్కువ మంది టీవీలకు అతుక్కుపోయారు. నగరంలో ఎప్పుడూ బిజీగా ఉండే కూడళ్లు బోసిపోయాయి. మూడులాంతర్ల జంక్షన్ నుంచి గంటస్తంభం, కన్యకాపరమేశ్వరి ఆలయం, కోట జంక్షన్, గుమ్చీ రోడ్డు, రైతుబజారు రోడ్డు ఖాళీగా దర్శనమిచ్చాయి. జిల్లాలోని ఇతర పట్టణాలూ ఇదే విధంగా కనిపించాయి. చివరకు భారత్ విజయం సాధించడంతో యువత కేరింతలు కొట్టారు. కొన్నిచోట్ల బాణసంచా కాల్చి ఇండియా టీంకు జేజేలు పలికారు.





విజయనగరం: నిర్మానుష్యంగా గుమ్చీ రోడ్డు

ఘనంగా సిరిమాను చెట్టు ఊరేగింపు

● సాలూరులో పండుగ సందడి ● శ్యామలాంబకు ప్రత్యేక పూజలు

సాలూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): సాలూరు గ్రామదేవత శ్యామలాంబ తల్లి పండగ నేపథ్యంలో ఆదివారం పట్టణంలో ఘనంగా సిరిమాను చెట్టును ఊరేగించారు. అమ్మవారి ఆలయానికి సమీపంలో ఉన్న ఆ చెట్టుకు ముందుగా అనువంశిక ధర్మకర్త విక్రమ చంద్ర సన్యాసిరాజు సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. ఆ తర్వాత మంత్రి గుమ్మిడి సంధ్యా రాణి, అల్లు, కర్రి, జన్ని కటుంబీకులు, పూజారి ధనంజయరావు తదితరులు సిరిమాను చెట్టుతో పాటు అమ్మవారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. పట్టణంలో శివాజీ బొమ్మ జంక్షన్ నుంచి బోసుబొమ్మ మీదుగా డబ్బివీధి, పెదకోమటిపేట, కోట దుర్గమ్మ గుడి వరకు సిరిమాను చెట్టు ఊరేగింపు సాగింది. ఆ తర్వాత ఎన్టీఆర్ విగ్రహం నుంచి బోసు బొమ్మ మీదుగా నాయుడు వీధి రామ మందిరం వద్దకు సిరిమాను చెట్టును తీసుకొచ్చారు. మార్చి ఒకటో తేదీన ఆ చెట్టును సిరిమానుగా రూపొందించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. కాగా 50 జతల ఎద్దులు, వేలాది మంది భక్తుల నడుమ పట్టణ పురవీధుల్లో సిరిమాను చెట్టు ఉరేగింపు సాగింది. దీంతో పండగ ముందే వచ్చినట్లయ్యింది. దారి పొడవునా భక్తులు సిరిమాను చెట్టుకు పసుపు, కుంకుమ, ముర్రాటలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పులివేషాలు, తిన్మార్ డబ్బులు, డీజే డ్యాన్సులతో పట్టణం సందడిగా మారింది.

ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పట్టణ సీఐ అప్పలనాయుడు పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్‌దేవ్ ఉత్సవ కమిటీ సభ్యులు ఎ.అప్పారావు, ఇ.నారాయణరావు, ఎస్.బంగారయ్య, తిరుపతిరావు (చిట్టి) తదితరులు పాల్గొన్నారు. మే 18,19,20 తేదీల్లో శ్యామలాంబ పండగ జరపునున్న నేపథ్యంలో అంజలి రథం, సిరిమాను చెట్టు పీటకు సంబంధించి ఆదివారం జీగిరాంలో మామిడి చెట్టును గుర్తించారు. ఈ మేరకు కర్రివీధి, గాడివీధి, వెలంపేట యువత, పెద్దలు తదితరులు అక్కడకు వెళ్లి ఆ చెట్టును కొట్టారు.



సిరిమాను చెట్టుకు పూజలు చేస్తున్న సాలూరు పట్టణ వాసులు



7లో

ఘనంగా ముగిసిన నాటిక పోటీలు

'చీకటి పువ్వు'కు ప్రథమ బహుమతి

వారు రావడం లే!

- మొక్కుబడిగా 'పొలం పిలుస్తోంది'
- హాజరుకాని అనుబంధ శాఖల అధికారులు ● మమ అనిపిస్తున్న వ్యవసాయ శాఖ

గజపతినగరం, ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి): రైతులను సాగులో సుశిక్షితులను చేసి సస్యరక్షణలో శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్ది వ్యవసాయం లాభసాటిగా మార్చాలన్నది ప్రభుత్వం ఉద్దేశం. ఈ సంకల్పంతో చేపడుతున్న పొలం పిలుస్తోంది కార్యక్రమం మొక్కుబడి చందమైంది. వ్యవసాయశాఖ అధికారులతో పాటు అనుబంధశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు కూడా రైతుల వద్దకు వెళ్లి సూచనలు ఇవ్వాలి. రైతు చెప్పిన సమస్యలు వినాలి. విత్తన ఎంపిక మొదలు ఎరువులు, పురుగు, తెగుళ్ల నివారణ మందులు, సాంకేతిక పరిజ్ఞానం తదితర అంశాలపై అన్నదాతలతో చర్చించి అవగాహన కల్పించాలి. ఇదేదీ క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. వ్యవసాయశాఖ అధికారులు మినహా మిగిలిన శాఖల అధికారులు కనిపించడం లేదు. జిల్లా వ్యాప్తంగా 27 మండలాల్లో ప్రతీ మండలంలో మంగళ, బుధవారాల్లో రెండు గ్రామాలు చొప్పున వారానికి నాలుగు గ్రామాల్లో పోలం పిలుస్తోంది కార్యక్రమం చేపట్టాలి. పొలాలను పరిశీలించి అభ్యుదయ రైతులను ప్రోత్సహించాలి. వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలోని గజపతినగరం, దత్తిరాజేరు, బొండపల్లి, మెంటాడ మండలాల్లో ఇంతవరకు 22వారాల పాటు 44 గ్రామసభలు నిర్వహించారు. అన్నిచోట్లా వ్యవసాయశాఖ అధికారులే కనిపించారు. నేతలు వచ్చిందే లేదు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు(ఫైల్)

ముందస్తు సమాచారం లేక వెలవెల

ఏరోజు ఏగ్రామంలో కార్యక్రమం జరుగుతుందో గ్రామంలో ముందస్తు సమాచారం ఇవ్వడం లేదు. రైతులు ఎవరి పనుల్లో వారు ఉంటున్నారు. వ్యవసాయశాఖ అధికారులు వారి షెడ్యూల్ ప్రకారం గ్రామాలకు వెళ్లి అటుగా వచ్చివెళ్లే రైతులను కూర్చోబెట్టి కార్యక్రమాన్ని మమ అనిపిస్తున్నారు. ఈపరిస్థితుల్లో విత్తనం నుంచి ఉత్పత్తి వరకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై చాలామందికి అవగాహన భ్రమగానే మారింది. వాస్తవానికి పొలంపిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయశాఖతో పాటు అనుబంధ శాఖలు హార్టీకల్చర్, ఫిషరీస్, వెటర్నరీ, మార్కెటింగ్ అధికారులు, విజ్ఞానకేంద్ర శాస్త్ర వేత్తలు, విద్యుత్, జలవనరులశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాల్సి ఉంది. వీరితో పాటు రైతు మిత్రసంఘాలు, భూసంరక్షణ అధికారులు హాజరై వ్యవసాయ అభివృద్ధికి అవసరమైన సలహాలు, సూచనలు అందజేయాలి. 2024-25 ఏడాదికి సంబంధించి సెప్టెంబర్ 24వతేదీ నుంచి ఈకార్యక్రమం ప్రారంభమయింది. మొదటివిడత షెడ్యూల్ పూర్తయి రెండో విడత షెడ్యూలు ప్రకారం కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రబీ సీజన్ కావడంతో అవగాహన సదస్సులు కొనసాగుతున్నాయి. అనుబంధ శాఖల అధికారులు రావడమే లేదని రైతులు చెబుతున్నారు.

అధికారులంతా హాజరుకావాలి

పోలం పిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులతో పాటు అన్ని అనుబంధ శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలి. ఆయాశాఖల పథకాలను తెలియజేసి రైతుల సమస్యలను పరిష్కరించాలి. కార్యక్రమం షెడ్యూల్‌ను అందరికీ పంపుతున్నాం.

- కె.మహరాజన్, ఏడీఏ, గజపతినగరం

రైతు బజార్లకు 230 క్వింటాళ్ల టమాటా

● నాలుగు రైతు బజార్ల ద్వారా విక్రయం

విజయనగరం రూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): టమాటా పంటకు గిట్టుబాటు ధర కల్పించడమే లక్ష్యంగా మార్కెటింగ్ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఈనెల 22, 23 తేదీల్లో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లోని టమాటాలను రైతుబజార్లకు తరలించారు. ఈ నెల 21న 170 క్వింటాళ్లు తరలించగా, ఆదివారం నాడు 70 క్వింటాళ్లు తరలించారు. శృంగవరపుకోట, విజయనగరంలోని మూడు రైతుబజార్లలో ప్రస్తుతం టమాటా ధర రూ 12గా నిర్ణయించారు. జిల్లా వ్యాప్తంగా ఆరేడు మండలాల్లో 170 హెక్టర్లలో పండిన పంటకు రైతులకు గిట్టుబాటు ధర రాకపోవడంతో తక్కువధరకు విక్రయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దాంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు మార్కెటింగ్ శాఖ అధికారులు దీనిపై స్పందించారు. రైతుల వద్ద టమాటాలను రైతుబజార్లకు తరలించే ఏర్పాట్లు చేశారు. రవాణా ఖర్చులు మినహాయించి, టమాటా పండించే రైతుకు మిగిలిన మొత్తాన్ని మార్కెటింగ్ శాఖ అందించారు. అదే విధంగా రైతులు కూడా ఇదే ధరకు రైతు బజార్లలో విక్రయించుకునే వెసులుబాటు కల్పించింది. మామూలుగా రైతు బజార్లలో ఎవరైనా విక్రయాలు చేయాలంటే గుర్తింపు కార్డు తప్పనిసరి. అయితే ప్రస్తుతం టమాటా ధర పతనాన్ని అడ్డుకునే లక్ష్యంగా టామోటో పండించే రైతు ఎవరైనా నేరుగా రైతుబజార్లలో ఎటువంటి అనుమతి లేకుండా విక్రయించుకునే వెసులుబాటు కల్పించింది.

రైతుకి గిట్టుబాటు ధరే లక్ష్యం

రైతులకు గిట్టుబాటు ధరే లక్ష్యంగా ముందుకు సాగాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. టమాటా ధర పతనం కాకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ నెల 22, 23 తేదీల్లో మొత్తంగా జిల్లాలోని వివిధ రైతుల నుంచి 230 క్వింటాళ్లను రైతు బజార్లకు తరలించాం. 24న కూడా అవసరమైతే, జిల్లావ్యాప్తంగా మరో 70 క్వింటాళ్లను విజయనగరంలోని మూడు రైతు బజార్లు, శృంగవరపుకోటలోని రైతు బజారుకు తరలించనున్నాం.

-బి.రవికిరణ్,
ఏడీ-మార్కెటింగ్ శాఖ



టమాటాలను తరలిస్తున్న దృశ్యం

రఘువర్మ గెలుపునకు కృషి చేయండి



ఎస్.కోట: ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి



నెల్లిమర్లలో రవిశేఖర్ ..



గరివిడిలో రామ్‌మల్లిక్ నాయుడు..

శృంగవరపుకోట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మను గెలిపించాలని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి కోరారు. అదివారం కాపు కార్పొరేషన్ డైరెక్టర్, కొమరాడ మాజీ జెడ్పీటీసీ ఎస్.శేఖర్ పాత్రుడుతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులతో సమావేశమయ్యారు. మండల పార్టీ అధ్యక్షుడు జీఎస్ నాయుడు, మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న తదితరులున్నారు.

●గజపతినగరం: ఉత్తరాంధ్ర ఉపాధ్యా ఎమ్మెల్సీ అభ్యర్థి రఘువర్మ విజయానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని మాజీమంత్రి, జనసేన పీఏసీ సభ్యురాలు పడాల అరుణ కోరారు. ఆదివారం తన స్వగృహంలో విలేకర్లతో ఆమె మాట్లాడారు. కూటమి ప్రభుత్వం మద్దతు తెలిపిన రఘువర్మకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మునకాల జగన్, మామిడి దురాప్రసాద్ రాపాక సాయిసురేష్ పాల్గొన్నారు.

●గరివిడి: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పాకలపాటి రఘువర్మను గెలిపించాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు కోరారు. ఆదివారం గరివిడిలో అభ్యాస ఇంగ్లీష్ మీడియం, గోదావరిదేవీ షరాఫ్ ఇంగ్లీషు మీడియం తదితర పాఠశాలల్లో రామ్‌మల్లిక్‌నాయుడు ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పైల బలరాం, రెడ్డి గోవింద తదితరులు పాల్గొన్నారు.

●నెల్లిమర: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ విజయానికి టీడీపీ సీనియర్ నాయకుడు, విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్ విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. రఘువర్మకు గెలుపునకు అందరూ సహకరించాలని అన్నారు.

●భోగాపురం: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మను గెలిపించాలని టీడీపీ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పార్టీ ఎన్నికల అబ్జర్వర్ మహమ్మద్ నజీర్ కోరారు. భోగాపురంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు కర్రోతు సత్యనారాయణతో కలిసి ఆదివారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నెల్లిమర్ల నియోజకవర్గ అబ్జర్వర్ పి.జయరాజు, మౌళీవర్మ, గొంప శ్రీను, పల్లంట్ల జగదీశ్ పల్ల రాంబాబు తదితరులు ఉన్నారు.

●విజయనగరం దాసన్నపేట: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాకలపాటి రఘువర్మకే జనసేన పార్టీ మద్దతు ఇస్తుందని జనసేన గజపతినగరం ఇన్‌చార్జి మర్రాపు సురేష్, కొప్పల వెలమ కార్పొరేషన్ డైరక్టరు మిడతాన రవికుమార్ అన్నారు. ఆదివారం మిడతాన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో జనసేన పార్వతీపురం ఇన్‌చార్జి ఆదాడ మోహనరావు, చీపురుపల్లి ఇన్‌చార్జి విసినిగిరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

●రాజాం: కూటమి అభ్యర్థి పాలకపాటి రఘువర్మను గెలిపించాలని నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు సూరాడ చంద్రమోహన్, టీడీపీ నాయకుడు కోండ్రు జగదీశ్ కోరారు. ఆదివారం కూటమి నాయకులతో కలిసి విస్తృత ప్రచారం చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకుకులు కిమిడి అశోక్‌కుమార్. టంకాల కన్నంనాయుడు పిల్లా సత్యంనాయుడు. శాసపు రమేష్‌కుమార్, దూబ ధర్మారావుతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

పుణ్యగిరి జాతరకు ప్రత్యేక బస్సులు

శృంగవరపుకోట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పుణ్యగిరి జాతరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ కె.రమేష్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 26 బుదవారం తెల్లవారుజాము 4 గంటల నుంచి ఈ నెల 27 గురువారం రాత్రి వరకు వరకు భక్తుల కోసం అందుబాటులో బస్సులు ఉంటాయన్నారు. పుణ్యగిరి కొండకు 15 బస్సులు, సన్యాసేశ్వరస్వామి ఆలయానికి 3 బస్సులు మెత్తం 18 బస్సులను నడుపుతామన్నారు.

తాగునీరు అందించండి

గజపతినగరం, ఫిబ్రవరి23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జిన్నాం గ్రామంలో తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని గ్రామస్థులు కోరారు. 15 రోజులుగా తాగునీరు సరఫరా లేక ఇబ్బందులు పడుతున్నామని మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలో కల్వర్టు పనుల నేపథ్యంలో తొలగించిన పైప్‌లైన్ పునరుద్ధరించకపోవడంతో గ్రామానికి తాగునీరు నిలిచి పోయింది. దాంతో స్థానికులు బోరుబావులను ఆశ్రయిస్తున్నారు.

రక్తదానం సామాజిక బాధ్యత

గజపతినగరం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రక్తదానం చేయడం సామాజిక బాధ్యతగా ప్రతిఒక్కరూ భావించాలని సహయ స్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సాయికుమార్, రేవంత్ అన్నారు. ఆదివారం మెంటాడ రోడ్డులోని ప్రభుత్వ పాఠశాలలో రక్తదానం శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 25 మంది యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో సభ్యులు విశ్వనాథ్, ప్రసాద్, డీవీఆర్ నాయుడు, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

రేగిడి విద్యుత్ ఏఈగా సురేష్

రేగిడి, ఫిబ్రవరి 23, (ఆంధ్రజ్యోతి): రేగిడి విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈగా వావిలపల్లి సురేష్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇంతవరకు సబ్ ఇంజినీర్ ఇన్‌చార్జి బాధ్యతలు చేసేవారు. ఎట్టకేలకు ఏఈని పూర్తిస్థాయిలో ఇక్కడ నియమించారు.

ఘనంగా సూర్యసదనం వార్షికోత్సవం

గరివిడి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): గరివిడిలోని సూర్యసదనం వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేమకోటి సూర్యనారాయణశర్మ ఆధ్వర్యంలో సూర్యనారాయణస్వామికి కల్యాణోత్సవం జరిగింది. ప్రత్యేక పూజలలో స్థానికులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

సారిపల్లి ఆలయానికి రూ.50 వేలు విరాళం

నెల్లిమర్ల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సారిపల్లిలో భ్రమరాంబికా మల్లికార్జునస్వామి ఆలయంలో శివపంచాక్షరీ మహా మంత్ర అఖండ నామ సప్తాహం, అన్నదాన కార్యక్రమానికి విజయనగరానికి చెందిన నేత్ర వైద్యుడు డాక్టర్ మంచు కుమారస్వామి, భారతి దంపతులు రూ.50 వేల విరాళాన్ని ప్రకటించారు. ఆదివారం ఆ మొత్తాన్ని కమిటీ ప్రతినిధులకు అందజేశారు. కార్యక్రమంలో ఆల్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రఘువర్మకు భాషోపాధ్యాయుల మద్దతు

రాజాం రూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ అభ్యర్థి రఘువర్మకు భాషోపాధ్యాయులు మద్దతు ప్రకటించారు. ఈమేరకు రాజాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన భాషోపాధ్యాయుల సమావేశంలో ఉపాధ్యాయులు గౌరి కుమార్, లెంక శ్రీనివాసరావు, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మజ్జి మదన్ మోహన్ పాల్గొన్నారు.

మద్దతు ధర ప్రకటించండి

లక్కవరపుకోట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): జీడి, మామిడి పంటలకు మద్దతు ధర ప్రకటించాలని వ్యవసాయ కార్మిక సంఘం నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యేకు కోళ్ల లలితకుమారికి వారు వినతిపత్రం అందజేశారు.

సెంచూరియన్‌లో సింగర్ రేవంత్ సందడి





కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ డి.ఎన్.రావు, గీతాలాపన చేస్తున్న రేవంత్

నెల్లిమర్ల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి: ప్రముఖ నేపథ్య గాయకుడు ఎల్.వి.రేవంత్ పాటలతో విద్యార్థులను ఉర్రూతలూగించారు. ఆదివారం సాయంత్రం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో జరిగిన గజజ్యోతి ముగింపు వేడుకలకు ప్రత్యేక ఆహ్వానితుడిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు సినీగీతాలను ఆలపించారు. అనంతరం కళాశాల విద్యార్థులు నృత్య ప్రదర్శనలతో అందిరినీ అలరించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ డి.ఎన్.రావు ఆయన సతీమణి పద్మ, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత్‌కుమార్ మొహంతి, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ఎస్ వర్మ, డీన్‌లు డాక్టర్ సన్నిడియోల్, డాక్టర్ విజయ్‌బాబు, పుష్పలత, అనిల్‌కుమార్, ఐక్యూ ఏసీ హెడ్ ప్రొఫెసర్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, జీటీఐడీఎస్ మేనేజింగ్ డైరెక్టర్ వెంకట్ శివానందకుమార్, గ్రామ్ తరంగ్ టెక్ మేనేజింగ్ డైరెక్టర్ బాబుశంకర్, సీఎస్ఆర్ కో-ఆర్డినేటర్లు శ్రావణి, ఆలన, జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారమే లక్ష్యం

విజయనగరం దాసన్నపేట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యారంగాన్ని బలపరిచి దానిని పరిరక్షించడమే పీడీఎఫ్ లక్ష్యమని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి అన్నారు. ఆదివారం జిల్లా పరిషత్ మినిస్టీరియల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడ ుతూ తన అభ్యర్థిత్వాన్ని బలపరిసే సీపీఎస్‌ను రద్దు చేసి, ఓపీఎస్ అమలు చేసేందుకు కృషి చేస్తానన్నారు. సమావేశంలో యూటీఎఫ్ ప్రతినిధులు రాము, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కారుపై ఎమ్మెల్యే స్టిక్కర్‌తో 'మాజీ' చక్కర్లు



ఎమ్మెల్యే స్టిక్కర్‌తో మాజీ ఎమ్మెల్యే వాహనం

రాజాం రూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఆయనో మాజీ ఎమ్మెల్యే. రెండుసార్లు రాజాం నియోజకవర్గ ప్రజలు ఆదరించి ఎమ్మెల్యేగా ఆయన్ని గెలిపించారు. అయితే గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైకాపా అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి రాజాం నుంచి కాకుండా పాయకరావుపేటకు నుంచి ఎన్నికల బరిలో నిలిపారు. అక్కడ ఆయన ఓడిపోయారు. అయినా సరే రాజాం ఎమ్మెల్యే అని తన కారు నెంబర్ (ఏపీ 39 హెచ్‌సి 2346) ప్లేట్‌తో ఎనిమిది నెలలుగా చక్కర్లు కొడుతున్నారు. ఈనెల 22న రాత్రి రాజాం- శ్రీకాకుళం రోడ్‌లో జరిగిన వివాహానికి హాజరైన ఆయన కారు నెంబర్ ప్లేట్‌ను చూసిన వారంతా ముక్కున వేలేసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే నెంబర్ ప్లేట్‌ను మార్చకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కళాకు ఆహ్వాన పత్రిక



ఆహ్వాన పత్రికను అందజేస్తున్న అధికారి

రాజాం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లిలో మార్చి 2 నుంచిన 4 వరకూ నిర్వహించనున్న కనకమహాలక్ష్మి జాతర హాజరు కావాలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్ నాయుడులను ఆలయ అధికారులు ఆహ్వానం పలికారు. ఆదివారం రాజాం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రికను అందజేశారు.

ఉచిత యోగా తరగతులు

శృంగవరపుకోట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): భర్తాపురంలోని వెంకటేశ్వర స్వామి ఆలయప్రాంగణంలో ఆదివారం విద్యార్థులకు స్థానిక మోక్షవిద్య యోగా మందిర్ యోగా తరగతులను నిర్వహించింది. భగవద్గీత సారంశాన్ని బోధించారు.

గ్రూప్-2 మెయిన్స్ ప్రశాంతం



బొండపల్లి: పరీక్ష కేంద్రం వద్ద వేచి ఉన్న అభ్యర్థులు

బొండపల్లి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్లాం గాయత్రి బీఈడీ కళాశాలలో గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. 480 మంది అభ్యర్థులకు గానూ 341 మంది పరీక్షకు హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్, చీఫ్ సూపరింటెండెంట్ చిల్లా పైడిరాజు, పర్యవేక్షకుడు బీసీ వెల్ఫేర్ ఈడీ పెంటోజీరావు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశారు. గజపతినగరం సీఐ జీవి.రమణ పర్యవేక్షణలో స్థానిక ఎస్ఐ మహేష్, సిబ్బంది తనిఖీలు చేపట్టి అభ్యర్థులను కేంద్రంలోకి అనుమతించారు.

●డెంకాడ: మండలంలోని చింతలవలసలోగల ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల, జొన్నాడ వద్ద గల లెండి ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం గ్రూప్-2 రాత పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. లెండి ఇంజినీరింగ్ కళాశాలలో 792 మందికి గాను 699 మంది ఎంవీజీఆర్‌లో 960 మంది గాను 843 మంది రాత పరీక్షలకు హాజరయ్యారు.

'చీకటి పువ్వు'కు ప్రథమ బహుమతి

● ద్వితీయ బహుమతి దక్కించుకున్న 'కొత్త పరిమళం' ● ఘనంగా ముగిసిన నాటిక పోటీలు



కళాకారులకు ప్రథమ బహుమతిని అందజేస్తున్న దృశ్యం

నెల్లిమర్ల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేటలో మూడు రోజుల పాటు నిర్వహించిన ఆరిపాక బ్రహ్మానందం స్మారక నాటిక పోటీల్లో కరీంనగర్ చైతన్య కళ భారతి కళాకారులు ప్రదర్శించిన 'చీకటి పువ్వు' నాటికకు ఉత్తమ ప్రదర్శనగా నిలిచింది. ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా శ్రీకాకుళం జిల్లా బొరివంకకు చెందిన శార్వాణి గిరిజన సాంస్కృతిక సేవాసంఘం కళాకారులు ప్రదర్శించిన కొత్త పరిమళం నాటికకు లభించింది. కాగా తృతీయ ఉత్తమ ప్రదర్శనగా విశాఖపట్నం తెలుగు కళాసమితి కళాకారులు ప్రదర్శించిన నిశ్శబ్దమా.. నీ ఖరీదెంత? నాటికకు నిలిచింది. శనివారం అర్థరాత్రి జరిగిన ముగింపు కార్యక్రమంలో విజేతలకు డీసీసీబీ మాజీ వైస్ ఛైర్మన్ చనమల్లు వెంకటరమణ, నగర పంచాయతీ వైస్ ఛైర్మన్ సముద్రపు రామారావు, గ్రామ పెద్దలు అందజేశారు. న్యాయమూర్తులు ప్రకటించిన జాబితా ప్రకారం విజేతల వివరాలు ఇలా ఉన్నాయి. ఉత్తమ దర్శకుడు బహుమతి మంచాల రమేష్ (చీకటి పువ్వు) ఉత్తమ రచయిత బహుమతి కెకెఎల్ స్వామి (కొత్త పరిమళం), ఉత్తమ నటుడు బహుమతి పి.వరప్రసాద్ (నిశ్శబ్దమా నీ ఖరీదెంత?)కు లభించాయి. ద్వితీయ ఉత్తమ నటుడుగా డి.గిరిబాబు (చీకటి పువ్వు), ఉత్తమ నటిగా జి.లహరి (చీకటి పువ్వు), ద్వితీయ ఉత్తమ నటిగా డి.హేమ (నిశ్శబ్దమా నీ ఖరీదెంత?) ఉత్తమ క్యారెక్టర్ నటుడుగా ఇటి రాంబాబు (నిశ్శబ్దమా నీ ఖరీదెంత?), ఉత్తమ సహాయ నటుడుగా బి.శోభన్‌బాబు (కొత్త పరిమళం), ఉత్తమ విలన్‌గా బి.చలం (కొత్త పరిమళం), ఉత్తమ హాస్యనటుడుగా బి.కన్నబాబు (నిశ్శబ్దమా నీ ఖరీదెంత?) బహుమతులు లభించాయి. ఉత్తమ రంగాలంకరణ రమణ (కొత్త పరిమళం), ఉత్తమ సంగీతం లీలామోహన్ (చీకటి పువ్వు), ఉత్తమ ఆహార్యం రమణ (కొత్త పరిమళం), జూరీ బహుమతులు డి.సత్యనారాయణ (దేవరాగం), డి.రాధాకృష్ణ (ఎడారిలో వాన చినుకు), భుజంగరావు (రైతే రాజు) లకు లభించాయి. అతిథులు చేతుల మీదుగా ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు వరుసగా రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు నగదు బహుమతులుతో పాటు షీల్డులను అందజేశారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా కుసుమాల నాగభూషణం, కేవీ మంగారావు, మానాపురం సత్యనారాయణ వ్యవహరించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు సముద్రపు రామారావు, అవనాపు సత్యనారాయణ, ఎం.ఎం.నాయుడు, నల్లి బంగారు చంద్రశేఖర్, అవనాపు మురళీకృష్ణ, తుమ్ము వెంకటరమణ, జనా ప్రసాద్, మద్దిల వాసు, కాళ్ల అప్పారావు, మద్దిల సన్యాసిరావు, కాళ్ల రాజశేఖర్, డొంక కృష్ణ, మద్దిల వాసు, కనకల హైమావతి, నిర్వాహక కమిటీ ప్రతినిధులు ఎంఈవో ఈపు విజయ్‌కుమార్, మిమ్స్ హెచ్ఆర్ జీఎం ఆరిపాక శ్రీనివాసరావు, ఆరిపాక రాము తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

● మరో ఇద్దరికి గాయాలు

క్రైంన్యూస్

గంట్యాడ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గింజేరు కూడలిలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో విజయనగరానికి చెందిన అల్లాడ ఆనంద్ (57) మృతి చెందారు. మరో ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయనగరానికి చెందిన కుమార్‌రాజా, అల్లాడ ఆనంద్‌కుమార్ ద్విచక్ర వాహనంపై అరుకు వెళ్తున్నారు. అదే దారిలో చెల్లూరుకు చెందిన దాసరి నారాయణరావు ద్విచక్ర వాహనంపై గింజేరు వైపు వెళ్తుండగా వీరు బైక్‌తో ఢీకొన్నారు. దాంతో బైక్ వెనుక కూర్చున్న ఆనంద్‌కుమార్ వెనక్కిపడిపోయాడు. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనలో గాయపడిన కుమార్‌రాజా, నారాయణరావులను 108 వాహనంలో జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ సాయికృష్ణ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు.

రైలు దిగుతూ ప్రమాదానికి గురైన వ్యక్తి

చీపురుపల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి):చీపురుపల్లి రైల్వే స్టేషన్‌లో రైలు దిగుతున్న ఓ ప్రయాణికుడు ప్రమాదవశాత్తూ కాలు జారడంతో తీవ్రంగా గాయపడ్డాడు. శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి గ్రామానికి చెందిన దూబ అప్పన్న ఆదివారం మధ్యాహ్నం విశాఖపట్నం నుంచి మెయిల్‌లో వస్తూ చీపురుపల్లి స్టేషన్‌లో దిగాడు. ఈక్రమంలో ఆయన కాలు జారి ప్లాట్‌ఫామ్, రైలుకు మధ్య ఇరుక్కుంది. దీంతో ఆయన కుడి కాలు నుజ్జునుయ్యింది. సమాచారం అందుకున్న 108 సిబ్బంది జయముని, తవిటినాయుడు వాహనంలోనే ప్రథమ చికిత్స అందించి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం

కొత్తవలస, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కొత్తవలస-విజయనగరంలో రోడ్డులోని పీఎంఎల్ కాంప్లెక్స్ వెనుక అపార్ట్‌మెంట్‌లోని డి.ముత్యాలనాయుడుకు చెందిన ఫ్లాటులో శనివారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం జరిగింది. సుమారు రెండు లక్షల రూపాయలవిలువైన వస్తువులు కాలిపోయాయి. విద్యుత్ షార్టుసర్క్యూట్ కారణంగానే ప్రమాదం సంభవించినట్టు సమాచారం. అర్ధరాత్రి గదినుంచి పొగలు రావడంతో స్థానికుల సాయంతో అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక అదికారి వై.అశోక్ కుమార్ సిబ్బందితో వెళ్లి మంటలను అదుపు చేశారు.

నలుగురికి త్రుటిలో తప్పిన ప్రమాదం

గుర్ల, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): త్రుటిలో నలుగురు వ్యక్తులకు పెను ప్రమాదం తప్పింది. లేకుంటే వారు అగ్నికి ఆహుతయ్యేవారు. క్షణాల్లో గడ్డి ట్రాక్టర్ బూడిదయ్యింది. ఇందుకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. గజపతినగరం మండలం ముచ్చర్ల నుంచి భోగాపురం ట్రాక్టర్ మీద గడ్డి ఎక్కించుకుని నలుగురు వ్యక్తులు వెళ్తున్నారు. మండలంలోని గరికవలస సమీపంలోని గెడ్డవాగు వద్ద వచ్చేసరికి గడ్డి ట్రాక్టర్‌కు హై వోల్టేజీ కరెంట్ వైర్లు తగిలాయి. దాంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ట్రాక్టర్ పైనున్న నలుగురూ ఆందోళనకు గురయ్యారు. వారి ముందు చెట్టుకొమ్మ అడ్డంగా ఉండటంతో దాన్ని పట్టుకుని వారు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. దీంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

పెదమానాపురం వద్ద లారీ బోల్తా

దత్తిరాజేరు, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదమానాపురం గేటు సమీపాన జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం రాళ్ల పిక్కల లోడుతో వస్తున్న లారీ బోల్తాపడింది. దీంతో కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. అంబటివలస నుంచి పెదమానాపురం పిక్కలోడుతో వస్తున్న లారీ అన్‌లోడ్ చేస్తున్న సమయంలో అదుపుతప్పి బోల్తాపడింది. లారీ పడిపోతున్న సమయంలో డ్రైవర్ లారీ నుంచి దూకేయడంతో ఎవరికి ఏమీ కాలేదు. అనంతరం లారీని తొలగించి పోలీసులు ట్రాఫిక్ క్లియర్ చేశారు.

డివైడర్‌ను ఢీకొని గాయాలు

బొండపల్లి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్లాం వద్ద బైపాస్ రోడ్డుపై ఒంపల్లికి వెళ్లే జంక్షన్‌లో డివైడర్‌ను ఆదివారం గజపతినగరానికి చెందిన బి.బాలు ద్విచక్ర వాహనంతో ఢీకొన్నాడు. దాంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. 108 వాహనంలోమహరాజా కేంద్ర ఆసుపత్రికి తరలించారు.

పెదబూరాడపేటలో ఇరువర్గాల కొట్లాట

నెల్లిమర్ల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదబూరాడపేటలో ఆదివారం జనసేన, టీడీపీ నాయకుల మధ్య ఘర్షణ జరిగి కొట్లాటకు దారితీసింది. ఈ ఘటనలో జనసేన మండల కో-ఆర్డినేటర్ కరుమజ్జి గోవిందరావుతో పాటు గ్రామ టీడీపీ నాయకుడు మక్కువ సత్యం అప్పలరాజుకు గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. జనసేన అధిష్ఠానం ఇచ్చిన పిలుపు మేరకు జనసేన పార్టీ నాయకులు పెదబూరాడపేటలో ఆదివారం ఉదయం గుడ్ మార్నింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ నాయకులో పాటు ఆ పార్టీ మండల కో-ఆర్డినేటర్ కరుమజ్జి గోవిందరావు కూడా హాజరయ్యారు. జనసేన పార్టీ నాయకులు తిరుగు ముఖం పడుతున్న సమయంలో గ్రామంలో ఇటీవల జరిగిన రేషన్ డీలర్ నియామకం విషయంపై ఆ గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు జనసేన నాయకులతో వాగ్వాదానికి దిగారు. దశాబ్దాల నుంచి ఉన్న డీలర్‌ను తొలగించి కొత్త వ్యక్తిని, జనసేన సానుభూతిపరుడిని నియమించాల్సిన అవసరం ఏమొచ్చిందని జనసేన నాయకులను నిలదీశారు. దీంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చిలికి చిలికి కొట్లాటకు దారి తీసింది. ఈ కొట్లాటలో జనసేన మండల కోఆర్డినేటర్ కరుమజ్జి గోవిందరావు చేతికి గాయాలయ్యాయి. అలాగే టీడీపీ నాయకుడు మక్కువ సత్యం అప్పలరాజు చేతికి కూడా గాయాలయ్యాయి. ఈ మేరకు ఇరు వర్గాల వారు నెల్లిమర్ల పోలీసులకు పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. భోగాపురం రూరల్ సిఐ జి.రామకృష్ణ, నెల్లిమర్ల ఎస్ఐ బి.గణేష్ గ్రామాన్ని సందర్శించి విచారణ ప్రారంభించారు. అవాంఛనీయ ఘటనలు జరుగకుండా గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు.

వాలీబాల్ టోర్నీ విజేత కందిశ జట్టు



విన్నర్ జట్టుతో నిర్వాహకులు

రేగిడి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొమిరలో విద్యాగణపతి జ్ఞానసరస్వతి సహిత షిర్డీసాయి ఆలయం ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం బాలికల వాల్‌బాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీల్లో రేగిడి, పాలకొండ, రాజాం, వీరఘట్టం, పార్వతీపురం మండలాల నుంచి 8 జట్లు పాల్గొన్నాయి. హోరాహోరీగా సాగిన పోటీలో రేగిడి మండలం కందిశ జట్టు విజేతగా నిలిచింది. కురపాం జట్టు ద్వితీయస్థానం, గుమ్మలక్ష్మీపురం తృతీయస్థానంలో నిలిచాయి. టోర్నమెంట్‌కు స్థానిక యూత్ పూర్తి సహకారం అందించింది

ఘనంగా ఆలయ ప్రారంభోత్సవం



అమ్మవారిని దర్శించుకొన్న కర్రోతు బంగార్రాజు

భోగాపురం, ఫిబ్రవరి23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగాలవలస లో ఆదివారం పైడితల్లిమ్మ ఆలయం ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించారు. దర్శించుకున్నారు. అమ్మవారిని మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు సర్పంచ్ బుగత లలిత, రామ్మోహన్ దర్శించుకున్నారు.

అందరితో పనులు చేయించండి

రాజాం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులకు వేతనదారులు అందరూ వచ్చేలా చర్యలు చేపట్టాలని డ్వామా పీడీ శారదాదేవి ఆదేశించారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల ఏపీవోలు, ఈసీలు, జేఈటీఏలు, ఎఫ్ఏ, ఎస్ఎంలతో ఆమె సమావేశమయ్యారు. కార్యక్రమంలో ఏపీడీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బడ్జెట్ భరోసా నింపేనా?

(ఐదో పేజీ తరువాయి)

రంగాలపై దృష్టిపెట్టాల్సిన అవసరముంది. ప్రభుత్వ వైద్య కాలేజీ నిర్మాణం పూర్తికాలేదు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక సౌకర్యాలు అరకొరగా ఉన్నాయి. వైద్యుల పోస్టులను సైతం భర్తీ చేయాల్సి ఉంది. ప్రతీ నియోజకవర్గంలో 300 పడకల ఆసుపత్రిని ఏర్పాటుచేస్తామని ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ హామీపై ఎటువంటి ప్రకటన వస్తుందోనని ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు. విద్యాపరంగా వసతులు మెరుగుపడాలి. నాడు-నేడు అంటూ గత ప్రభుత్వం చేపట్టిన పాఠశాలల భవనాల పనులు మధ్యలో ఆగిపోయాయి.

● జిల్లాలో 27 కిలోమీటర్ల మేర తీర ప్రాంతం ఉంది. పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో పదుల సంఖ్యలో మత్స్యకార గ్రామాలున్నాయి. వీటి పరిధిలో జెట్టి నిర్మాణం చేపట్టాలన్న డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. మరోవైపు జిల్లాలో పర్యాటక అభివృద్ధి పడకేసింది.

బొబ్బిలి ప్రాంతంలో సాగునీటి ఇక్కట్లు..

బొబ్బిలి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): సుమారు రెండు దశాబ్దాల నుంచి వెంగళరాయసాగర్ కాలువల లైనింగ్, ఆధునికీకరణ, అదనపు ఆయకట్టు పథకాలు రైతులను ఊరిస్తూనే ఉన్నాయి. నిధుల లేమితో ఆ ప్రతిపాదనలు సుదీర్ఘంగా మొద్దునిద్రలో ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఇరిగేషన్ రంగం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది. తోటపల్లి కాలువల నుంచి బొబ్బిలి మండలం రాముడువలస, తెర్లాం మండలం లోచర్ల, బాడంగి మండలం వాడాడ గ్రామాలకు ఎత్తిపోతల పథకాలను ప్రతిపాదించారు. శంకుస్థాపనలు కూడా జరిగాయి. పనులు అడుగు ముందుకు కదలలేదు.

● వెంగళరాయసాగర్ అదనపు ఆయకట్టుకు అవసరమైన భూసేకరణ పనులను ఏళ్లతరబడి పూర్తి చేయలేకపోయారు. బొబ్బిలి ఏపీఐఐసీ గ్రోత్ సెంటరులో పారిశ్రామిక ప్రగతి ఆశించిన స్థాయిలో లేదు. కూటమి ప్రభుత్వంపై జనం ఎన్నో ఆశలు పెట్టుకున్నారు.

శ్యామలాంబ పండుగను విజయవంతం చేయాలి



సిరిమాను తరలించేందుకు వెళ్తున్న డబ్బి వీధి వాసులు

సాలూరు రూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): సిరిమాను చెట్టును నాయుడు వీధికి తరలించే అవకాశం డబ్బివీధి వాసులకు రావడం అదృష్టమేనని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్పీభంజ్‌దేవ్ అన్నారు. ఆదివారం సిరిమాను తరలించే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. శ్యామలాంబ పండగ విజయవంతానికి ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. టీడీపీ పట్టణాధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సమస్యలు పరిష్కరించాలి



మంత్రి సంధ్యారాణికి వినతిపత్రం ఇస్తున్న ఆదివాసీ గిరిజన నేతలు

సాలూరు రూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): గిరిజన సమస్యలను పరిష్కరించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు సిదరపు అప్పారావు కోరారు. ఈ మేరకు ఆదివారం సాలూరులోని మంత్రి గుమ్మిడి సంధ్యారాణికి వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని, సాలూరులో గిరిజన భవనం నిర్మించాలని, అటవీ పట్టాలు అందించాలని కోరారు. చెక్‌డ్యాములు నిర్మించాలని, దుగ్గేరు, నంద, వేటగానివలస, కురుకూటిలో పీహెచ్‌సీలను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మర్రి శ్రీనివాసరావు, గాసి తదితరులు పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్‌కు వితరణ



పోలీసులకు సామగ్రి అందజేస్తున్న దృశ్యం

బొబ్బిలి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పోలీసుస్టేషన్‌కు బ్యాంకు అధికారులు స్టీలు కుర్చీలు, బారికేడ్లు వితరణగా అందజేశారు. క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ లిమిటెడ్ కంపెనీ, క్రెడిట్ యాక్సెస్ ఇండియా ఫౌండేషన్ కార్పొరేట్ సంస్థలు ఆదివారం స్టీలు సోఫాలు, ఐదు బారికేడ్లను ఆదివారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఎస్ఐ జ్ఞానప్రసాద్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ డివిజనల్ మేనేజరు వెంకటరమణ, లైజనింగ్ అధికారి రమేష్‌బాబు, ఏరియా మేనేజరు చక్రధరరావు, బీఎం తిరుపతిరావు, సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వ సాహిత్య వేదికపై 'అమ్మ' నవల

రాజాం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రష్యన్ రచయిత మాగ్జిం గోర్కీ రాసిన అమ్మ నవల విశ్వసాహిత్య వేదికపై వెలుగొందుతున్న గొప్ప గ్రంథమని సమతం మహేశ్వరరావు అభిప్రాయపడ్డారు. ఆదివారం స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో రాజాం రచయితల వేదిక 121వ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మహేశ్వరరావు అమ్మ నవలపై ముఖ్య ప్రసంగం చేశారు. ఈసందర్భంగా మహేశ్వరరావుని వేదిక సభ్యులు సత్కరించారు రౌతు గణపతిరావునాయుడు అధ్యక్షతన జరిగిన సభలో వేదిక నిర్వాహకుడు గార రంగనాథం, రౌతు నిర్మల, ఒమ్మి రమణమూర్తి, పిల్లా తిరుపతిరావు, పెంకి చైతన్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో కల్వర్టు

● పొంచి ఉన్న ప్రమాదం

బొబ్బిలి రూరల్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపెంట గ్రామానికి సమీపంలో పెంట చానల్ సాగునీటి కాలువ మీద నిర్మించిన కల్వర్టు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. రక్షణ గోడ సగం కూలి, కింద ఇనుప గజాలు తుప్పు పట్టి విరిగిపోతున్నాయి. ఈ కల్వర్టు దెబ్బతిని, శిథిలావస్థకు చేరడంతో ఎడ్ల బళ్లు, ఇతర వాహనాలతో ఈ మార్గంలో వెళ్లడానికి భయపడుతున్నారు. ఎప్పుడు కూలిపోతుందోనని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ప్రమాదం సంభవించకముందే కొత్త కల్వర్టు నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయం నీటిపారుదల, పంచాయతీ శాఖాధికారులకు తెలియజేశామని గ్రామస్థులు తెలిపారు. ● ఈ విషయంపై నీటి పారుదల ఏఈ హరిబాబును వివరణ కోరగా.. కల్వర్టును పరిశీలించి, ఉన్నతాధికారు లకు ప్రతిపాదనలు పంపిస్తామని చెప్పారు.



కొత్తపెంట వద్ద ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు

జిల్లా సమస్యలు చర్చకు రావాలి

● నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం

రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాల్లో జిల్లా సమస్యలు ప్రస్తావనకు రావాలని ప్రజలంతా కోరు తున్నారు. తమ నియోజకవర్గాలోని ప్రధాన సమస్యలను సభ దృష్టికి తీసుకు వెళ్తామని ఎమ్మెల్యేలు చెబుతు న్నారు. రోడ్లు, తాగునీరు, పరిశ్రమలు, మౌలిక వసతులు కల్పించాలని, నిధులు ఇతోధికంగా కేటాయిం చాలని కోరతామని చెప్పారు. ప్రాజెక్టుల పెండింగ్ పనులు, ఆయకట్టు పెంపునకు కృషి చేస్తామన్నారు. **(ఆంధ్రజ్యోతి బృందం)**

తోటపల్లి సమస్యను ప్రస్తావిస్తా



తోటపల్లి ప్రాజెక్టుకు సంబంధించి రణస్థలం బ్రాంచి కెనాల్ కింద మిగిలి ఉన్న పనుల కోసం ఇంకా భూ సేకరణ పూర్తి కావాల్సి ఉంది. ఇందుకోసం రూ.150 కోట్లు కేటాయించారు. కుడి ప్రధాన కాలువలో పూడిక తీత పనుల కోసం రూ.86 కోట్లు మంజూరయ్యాయి. ఈ విషయాలపై అసెంబ్లీలో ప్రస్తావిస్తా.

- కిమిడి కళావెంకటరావు, ఎమ్మెల్యే, చీపురుపల్లి

ప్రాజెక్టులపై దృష్టి పెట్టాం



రాజాం నియోజకవర్గం గత ఐదేళ్లలో తీవ్రంగా నష్టపోయింది. ప్రస్తుతం సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, ఆధునికీకరణపై దృష్టిపెట్టాం. రాజాంలో రహదారులకు నిధుల సాధనే ధ్యేయం. త్వరలో మునిసిపాల్టీకి ఎన్నికలు నిర్వహించాలని కోరతాను.

- కోండ్రు మురళీమోహన్, ఎమ్మెల్యే, రాజాం

పాడి రైతులు ఇబ్బంది పడుతున్నారు



బొబ్బిలి నియోజకవర్గంలో వెటర్నరీ డాక్టర్స్, సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉండడంతో పాడిరైతులు ఇబ్బందులు పడుతున్నారు. వెంగళరాయసాగర్, పెద్దగెడ్డ కెనాల్స్ పర్మినెంట్ లైనింగ్, జైకా నిధుల మంజూరు, బిల్లుల చెల్లింపు వంటి సమస్యలను అసెంబ్లీ దృష్టికి తీసుకెళ్తాను. **- బేబీనాయన, ఎమ్మెల్యే, బొబ్బిలి**

భీమసింగి షుగర్స్‌పై ప్రస్తావిస్తా



అసెంబ్లీ సమావేశాల్లో భీమసింగి షుగర్స్ కోసం ప్రస్తావిస్తా. ఫ్యాక్టరీ భవితవ్యంపై ప్రభుత్వానికి స్పష్టత ఇస్తాను. నియోజవర్గంలో రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరుతో పాటు ఎస్.కోట సామాజిక ఆసుపత్రిలో సదుపాయాల కల్పనపై మాట్లాడుతాను.

- కోళ్ల లలితకుమారి, ఎమ్మెల్యే, ఎస్.కోట

పారిశ్రామికవాడగా అభివృద్ధి చేస్తాం



నెల్లిమర్ల నియోజకవర్గాన్ని పారిశ్రామిక వాడగా అభివృద్ధి చేస్తాం. భోగాపురం, పూసపాటిరేగ మండలాల్లో ఉన్న మత్స్యకారులకు జెట్టీల నిర్మాణం చేస్తాం. తారకరామ ప్రాజెక్టును పూర్తిచేయాలని కోరతాం. ప్రధానంగా తాగునీటికి ప్రాధాన్యం ఇస్తాం.

- లోకం నాగమాధవి, ఎమ్మెల్యే, నెల్లిమర్ల

సభ దృష్టికి ప్రధాన సమస్యలు



అసెంబ్లీ సమావేశంలో నియోజకవర్గంలో వున్న ప్రధాన సమస్యలను ప్రస్తావిస్తాను. భూ సర్వే మళ్లీ చేయాలని కోరుతాను. విజయనగరంలోని ప్రభుత్వ వసతి గృహాలకు శాశ్వత భవనాలు మంజూరు చేయాలని కోరుతా.

- అదితి గజపతిరాజు, ఎమ్మెల్యే, విజయనగరం

రబ్బర్ డ్యామ్‌కు రూ.51 కోట్లు అవసరం

జంఝావతి రబ్బర్ డ్యామ్‌కు మెయిన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ లైన్‌కు ప్యాకేజీ-2 కింద పనులు చేపట్టేందుకు రూ.51 కోట్లతో ప్రతిపాదనలు పంపాం. వెంగళరాయసాగర్ అదనపు ఆయకట్టు పథకానికి రూ.5.18 కోట్లు మంజూరయ్యాయి. ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్‌లో 13 పనులకు రూ.44 లక్షలు నిధులు అవసరమని కోరాం.

- ఆర్.అప్పారావు, ఇరిగేషన్ ఎస్ఈ, బొబ్బిలి

'తారకరామ' పూర్తి చేయాలి

గుర్ల మండలంలో చంపావతి నదిపై ఆనందపురం వద్ద చేపట్టిన తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టుకు మా భూములిచ్చాం. ప్రాజెక్టు పనులు ప్రారంభించి దశాబ్దాలు గడుస్తోంది. ప్రాజెక్టు పూర్తయితే మా ప్రాంతంలో భూగర్భ జలాలు పెరిగి పంటలు పండుతాయన్నది మా ఆశ. వెంటనే ఆ ప్రాజెక్టు పూర్తి అయ్యేలా చూడాలి.

- ఇ.బంగారునాయుడు నక్కలపేట, గుర్ల మండలం

ఉద్యాన పంటలను అభివృద్ధి చేయాలి

జిల్లాలో మామిడితో పాటు పలు ఉద్యానవన పంటలను అభివృద్ధి చేయాల్సి ఉంది. ఎగుమతులకు పనికొచ్చే మామిడి రకాలను జిల్లాలో పండిస్తున్నారు. అందుకు అనుగుణంగా ప్రభుత్వ ప్రోత్సాహం చాలా అవసరం. మామిడి ఉత్పత్తుల ప్రదర్శనలు నిర్వహించాలి. ఉద్యాన శాఖను రైతాంగానికి ప్రయోజనకరంగా తీర్చిదిద్దాలి.

- సాలా వెంకటమురళీకృష్ణ, ఆదర్శ రైతు, బొబ్బిలి

పరిశ్రమలు రావాలి

వెనుకబడిన ప్రాంతమైన విజయనగరానికి పరిశ్రమలు రావాలి. వాటిని ఏర్పాటు చేసే వారికి రాయితీలు ఇవ్వాలి. వచ్చే ఏడాది నాటికి ఎయిర్‌పోర్టు నిర్మాణం పూర్తికానున్న నేపథ్యంలో ప్రముఖ హోటల్స్, అదే విధంగా చిన్న, చిన్న పరిశ్రమలు రానున్నాయి. ఇందుకు తగిన మౌలిక సదుపాయాలు ఏర్పాటైతే అన్ని విధాలా మేలు జరుగుతుంది.

- సోమయాజులు, సీనియర్ ఆడిటర్, విజయనగరం

వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఏ వృత్తిలో ఉన్న వారైనా తమ వృత్తి నైపుణ్యాలను ఎప్పటికప్పుడు పెంపొందించుకోవడం చాలా అవసరమని ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఆధ్వర్యంలో స్థానిక టీబీఆర్ ఫంక్షన్ హాలులో రెండు రోజు ఆదివారం నిర్వహించిన కంటిన్యువస్ మెడికల్ ఎడ్యుకేషన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. ఐఎంఏ స్థానిక అధ్యక్ష, కార్యదర్శులు డా.గుల్ల రామ్‌నరేశ్, అక్కేన దివాకర్‌బాబు, కృష్ణకుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి సుమారు 300 మంది వైద్య నిపుణులు, వైద్యులు హాజరయ్యారు. వైద్య వృత్తిలో నైపుణ్యాలను ఎలా పెంపొందించుకోవాలో వివరించారు.

గర్భిణులను వసతిగృహంలో చేర్పించాలి



వసతిగృహంలో గర్భిణులతో మాట్లాడుతున్న వైద్య ఆరోగ్య శాఖ జిల్లా ప్రోగ్రాం అధికారులు జగన్మోహనరావు, రఘు

సాలూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): గిరిశిఖర గ్రామాల్లో ఉన్న గర్భిణులను తప్పనిసరిగా గర్భిణుల వసతిగృహంలో చేర్పించాలని వైద్య ఆరోగ్య శాఖ జిల్లా ప్రోగ్రాం అధికారులు టి.జగన్మోహనరావు, పీఎల్ రఘు అన్నారు. పట్టణంలోని వైటీసీలో ఉన్న గిరిశిఖర గ్రామాల గర్భిణుల వసతి గృహాన్ని వారు ఆదివారం తనిఖీ చేశారు. ప్రస్తుతం చేరిన గర్భిణులు వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బందిపై ఆరా తీశారు. గర్భిణులకు ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తకుండా చూడాలని కోరారు. ఆయన వెంట వైటీసీ మేనేజర్ విద్యాసాగర్, వైద్య సిబ్బంది ఉన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై గళం

బెలగాం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపించి పెద్దల సభకు పంపిస్తే ఉపాధ్యాయ సమస్యలపై గళమెత్తుతానని పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి అన్నారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో ఆమె విలేకర్లతో మాట్లాడారు. మొదటి ప్రాధాన్యత ఓటు తనకు వేసి గెలిపించాలని కోరారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్‌రావు, జిల్లా అధ్యక్షుడు టి.రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విజయగౌరి

పరిశుభ్రతపై దృష్టి సారించాలి

గరుగుబిల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): సచివాలయాల సిబ్బంది పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని మండల పంచాయతీ విస్తరణాధికారి ఎల్.గో పాలరావు సూచించారు. మండలంలోని సుంకి, ఉల్లిభద్ర, కొంకడివరం పంచాయతీలలో ఇం టింటి చెత్త సేకరణ కార్యక్రమాన్ని ఆయన ఆదివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సేకరించిన వ్యర్థాలను వేరు చేసి గ్రీన్ అంబాసిడర్లకు అందించాలన్నారు. సర్పంచ్ కె.రవీంద్ర, కార్యదర్శులు పాల్గొన్నారు.



సుంకిలో ఇంటింటి చెత్త సేకరణను పరిశీలిస్తున్న ఈవోపీఆర్‌డీ గోపాలరావు

విద్యార్థుల సంఖ్య ఆధారంగా పాఠశాలలు ఏర్పాటు చేయాలి

రామభద్రపురం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): అర్బన్ ప్రాంతాల్లో విద్యార్థుల సంఖ్యను బట్టి అప్‌గ్రేడేషన్, మోడల్ ప్రాథమిక పాఠశాలలు ఏర్పాటు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు కోరారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. హైస్కూల్ ప్లస్ పాఠశాలను పరిశీలించి జూనియర్ కాలేజీల కంటే మెరుగ్గా ఉంటే వాటిని మరింత బలోపేతం చేయాలన్నారు. జీవో నెం.117 ఉపసంహరణ చేసే క్రమంలో 3, 4, 5 తరగ తులను మోడల్ ప్రైమరీ స్కూల్‌లో విలీనం చేయాలనుకుంటే కిలోమీటర్ పరిధి వరకే పరిమితం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరంజీ వి, ఏపీటీఎఫ్ విజయనగరం జిల్లా శాఖ అధ్య క్షుడు మడక బలరాంనాయుడు, జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్‌వీ పైడిరాజు, ఏపీటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తల్లీకొడుకులకు గాయాలు

బొబ్బిలి రూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రంగరాయపురం సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లీ కొడుకులకు స్వల్ప గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్లగా.. దత్తిరాజేరు మండలం విజయరాంపురం గ్రామానికి చెందిన తల్లి, తన కుమారుడు (గౌరమ్మ, అనిల్‌కుమార్) ద్విచక్ర వాహనంపై బొబ్బిలి వస్తున్నారు. అయితే రంగరాయపురం సమీపంలో వెనుక నుంచి ఆటో వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో వాహనం అదుపు తప్పి రహదారిపై పడిపోయారు. ఈ ప్రమాదంలో గౌరమ్మకు తలకి గాయాలు కాగా, అనిల్‌కుమార్‌కు కాలికి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే ఆ ప్రాంతంలో ఉన్న స్థానికులు బొబ్బిలి ఆసుపత్రికి తరలించారు. స్వల్ప గాయాలు కారణంగా ప్రథమ చికిత్స అనంతరం వారు ఇంటికి వెళ్లిపోయారు.

గ్రామ దేవతకు పూజలు

భామిని, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలేరు తవిటమ్మతల్లి గ్రామ దేవతకు ఆదివారం మొక్కులు చెల్లించారు. ఇటీవల విగ్రహ ప్రతిష్ఠ చేశారు. మహిళలు ముర్రాటలతో ఊరేగింపుగా వచ్చి మొక్కులు చెల్లించారు.



చెవిటమ్మ మండపం వద్ద ఘటాలతో మహిళలు

న్యూస్ బాక్స్

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సీతానగరం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతిచెందాడు. మండలంలోని గెడ్డలుప్పి గ్రామానికి చెందిన సొంగల కృష్ణమూర్తి(50) అనారోగ్యంతో బాధపడుతూ, బాధను తట్టుకోలేక శనివారం పురుగు మందు తాగి ఆత్మహత్యా ప్రయత్నం చేసుకున్నాడు. విజయనగరం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

మక్కువ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ములక్కాయవలస ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశానికి ఈనెల 24 నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ ఎన్.స్వర్ణలత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓసీ, బీసీలకు రూ.150, ఎస్సీ, ఎస్టీలకు 75 శాతం ఫీజు ఉంటుందన్నారు. వచ్చే నెల 20తో గడువు ముగుస్తుందని, ఏప్రిల్ 24న పరీక్ష ఉంటుందని చెప్పారు. ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

మారని చిత్రాలు



రావివలస పీహెచ్‌సీ భవనంపై తొలగించని జగన్ చిత్రం

గరుగుబిల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మారి నెలలు గడుస్తున్నా ప్రభుత్వ కార్యాలయాల్లో చిత్రాలు మారడం లేదు. రావివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రంపై వైసీపీ హయాంలో జగన్ బొమ్మతో కూడిన నవరత్నాలు పథకం సిక్కర్ అతికించారు. అది ఇప్పటికీ దర్శనమిస్తోంది.

ఘనంగా దాసాంజనేయ ఆలయ శతాబ్ది ఉత్సవాలు

బొబ్బిలి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలోని అగ్రహారం వీధిలో గల దాసాంజనేయ స్వామి ఆలయ శతాబ్ది ఉత్సవాలు, విగ్రహ పునః ప్రతిష్ఠ కార్యక్రమాలు మూడు రోజుల నుంచి ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ, శాంతి కల్యాణం, అన్న ప్రసాద వితరణకు పెద్దసంఖ్యలో భక్తులు హాజరయ్యారు.



ప్రతిష్ఠించిన స్వామివారి విగ్రహం